
పి.వి.బి. శ్రీరామమూర్తి

# అతని భయం



"ఈ విషయం తెలుసా మీకు?" మూడు రోజుల ప్రయాణాన్ని ముగించుకొని గుమ్మంలోకి రాగానే శ్రీమతి వేసిన ప్రశ్న.

"ఏ విషయమో తెలీకుండా, నువ్వు చెప్పకుండా నాకెలా తెలుస్తుంది?" చిరాగ్గా జవాబిచ్చాను.

"అబ్బ. అదేనండీ... మీ లోభేశ్వర్రావు.. అదే లోకేశ్వర్రావు లేడూ?" అంటూ చెప్పబోయింది.

"లేకేం?..... నిక్షేపంలా ఉంటాడు....." అన్నాను.

"అదే...మరి నిక్షేపంగా ఉన్నాడు.. చావు బతుకుల్లో హాస్పిటల్లో...." అన్నది శ్రీమతి వాక్యాన్ని ముక్కలు ముక్కలుగా విరుస్తూ.

"ఆ..." సూట్‌కేస్ జారవిడిచాను. వెంటనే "అసలేవయిందీ?" ఆతురతగా ప్రశ్నించాను.

"పూర్తి వివరాలు నాకూ తెలీవు. కానీ ఎదరగా వస్తోన్న లారీ స్కూటర్ మీద వెళ్తోన్న ఇతణ్ణి ఢీకొందట. ఏదో ప్రయివేట్ నర్సింగ్ హోంకి తీసికెళ్తే గవర్నమెంటు హాస్పిటల్‌కి తరలించారు. ఇంటెన్సివ్‌లో ఉంచినట్లు వాళ్ళావిడ ఫోన్ చేసింది."

'భగవంతుడా! మా 'లోకేశ్వర్రావు'ని నువ్వే రక్షించాలి!' అని ఆ ఏడుకొండలస్వామిని మొక్కుకున్నాను. "సుమా! నేను హాస్పిటల్ కెళ్ళొస్తాను" అని వెనుతిరగబోతుంటే.... "నేనూ వస్తాను ఆగండి. కాళ్ళూ, చేతులూ కడుక్కోండి. కాఫీ కలిపి తెస్తాను. తాగి బయలుదేరొచ్చు" అంది.

సుమతి మాటలకు ఎదురుచెప్పలేదు.

డ్రెస్ మార్చుకుని, బాత్రూం కెళ్ళొచ్చాను. శ్రీమతి తెచ్చిన కాఫీ తాగి గబగబా బయలు దేరాను. స్కూటర్ తియ్యబోతుంటే "ఏమండీ! మీరసలే ఆందోళనగా ఉన్నారు. స్కూటరొద్దండీ ఆటోలో పోదాం!" అంది శ్రీమతి.

శ్రీమతి మాట ప్రకారమే ఆటోలోనే ప్రభుత్వ ఆసుపత్రికి బయలుదేరాం.

మనసంతా వికలమయిపోయింది.

లోకేశ్వర్రావుతో నాకు మూడు దశాబ్దాల పరిచయం. ఇవాళ్టిది కాదు. విజయనగరం

మహరాజ కళాశాలలో ఇద్దరం కలసి చదువు కున్నాం.

అక్కడే సింహాచలం దేవస్థానం సత్రంలో మూడు సంవత్సరాలు భోజనం చేశాం. అయ్యకోనేరు తూర్పు గట్టున కర్రా వాళ్ళింట్లో పదిరూపాయల అద్దెకి ఒకేరూపంలో ఉండే వాళ్ళం.

లోకేశ్వర్రావు చాలా పేద కుటుంబం నుంచి వచ్చాడు. ఏడుగురన్నదమ్ములు, నలుగురక్కచెల్లెళ్ళు. వాళ్ళ నాన్నగారూ హయ్యరు గ్రేడు టీచరుగా పనిచేసేవారు. ఆ రోజుల్లో అతనికి నూర్రూపాయల జీతం. పదిహేనుమంది కుటుంబాన్నీ, తోడబుట్టిన అక్కచెల్లెళ్ళనీ ఈడ్చుకురావటం అతనికి కష్టంగా ఉండేది. అందుకే పిల్లల్ని ఎవర్నీ ప్రయోజకులను చెయ్యలేకపోయాడు.

కడగొట్టువాడయిన లోకేశ్వర్రావు నెలాగయినా చదివించాలనుకున్నాడు. లోకేశ్వర్రావు తెలివైన వాడే. అయితే లేమి ఏ పనులు చేయించటానికైనా వెనుకాడనివ్వదు. అందునుంచి లోకేశ్వర్రావు చేసే పనులు కొందరికి వెగటు పుట్టించేవి.

అదిగో, అలాటి రోజుల్లోనే అతనిపేరు 'లోభేశ్వర్రావు' గా మారింది. ఇంకా అతనికి మరికొన్ని గుప్తనామాలుండేవి. వాటిల్లో 'గెల కిందరిటిపండు' 'పుచ్చు వంకాయ' లాటివి మచ్చుకు మాత్రమే.

అయ్యకోనేరు ఉత్తర గట్టులోనే వి.ఎన్.ఎన్. విలాస్ అని ఉండేది. మేం ఉదయాన్నే అక్కడే టిఫిన్ చేసేవాళ్ళం. లోకేశ్వర్రావూ నాతోనే టిఫిన్ కొచ్చేవాడు. అప్పుడప్పుడు తినే టిఫిన్ ఎక్కువయినా, తక్కువ డబ్బులిచ్చేవాడు. నర్వర్‌తో వాదించేవాడు. హోటల్ ఓనర్ అయ్యరు "పోనీ వెళ్ళు బాబూ!" అని పంపేసేవాడు. నేను దెబ్బలాడితే "ఆకలేస్తోందిరా! డబ్బులు తక్కువ ఉన్నాయి. ఏం చేయనూ?" అనేవాడు. "నన్నడిగితే ఇచ్చేవాణ్ణిగా" అంటే. "ఈ రోజు వాడు గమనించాడు. అప్పుడప్పుడూ నాకది అలవాటే" అన్నాడోసారి.

సాయంకాలం పూట కాలేజీ నుండి వస్తూ బొంకులు దిబ్బ దగ్గర అరటిపళ్ళు కొనే వాడు. ఓ పావలా ఇచ్చి గెలకింద అరటిపళ్ళు బాగా చితికిపోయినవి ఓ రెండు డజన్లు (ఆరోజుల్లో) తీసుకొచ్చేవాడు. వాటిని లాడ్జికి తెచ్చి జాగ్రత్తగా తొక్కలు తీసి కుళ్ళిపోయిన, బాగా నలిగిపోయిన భాగాల్ని చిదిమేసి తక్కిన భాగాలు తినేవాడు. నేను చిరాకు పడేవాణ్ణి. "ఏరా! ఆ డబ్బిస్తే నాలుగు మంచి అరటి పళ్ళిస్తారు. కొనుక్కుని తినొచ్చుగా!" అంటే "నీకు తెలీదురా! నేనిప్పుడు డజనకు పైగా అరటి పళ్ళు తిన్నాను. మూడు, నాలుగర టిపళ్ళతో నా కడుపు నిండదు. ఎలా చావను?" అనేవాడు.

'దరిద్రానికి ఆకలెక్కువంటారిందు కేనేమో అనుకుని ఊరుకునేవాణ్ణి. వినాయక నవరాత్రులు జరిగిన తొమ్మిది రోజులూ, పైడితల్లి అమ్మవారి యాత్ర జరిగిన రోజుల్లోనూ గొప్ప హుషారుగా ఉండేవాడు. ఉదయాన్నే తెమిలిపోయి, పంచకట్టుకుని, బొట్టుపెట్టు కుని, ఓ వడక జందెం (వూ వాడికి అప్పటికింకా ఒడుగు కాలేదు!) వేసేసుకొని, ఏ వీధిలోనో కుదిరిపోయేవాడు.

ఉదయ సాయంకాలాలు వినాయక పూజలు చేయించి డబ్బులు సంపాదించేవాడు. కార్తీక సోమవారాలు భోజనాలకు పిలిస్తే గంతులేసుకుంటూ వేళ్ళేవాడు. నాలుగు డబ్బులు పోగేసుకునేవాడు. ఏ రాత్రి కొచ్చినా రెండు గంటలు దీక్షగా చదివేవాడు. డిగ్రీ మంచి మార్కులతోనే పాసయ్యాడు.

ఇద్దరికీ విజయనగరంలోనే ఉద్యోగా లొచ్చాయి.

ఉద్యోగం వచ్చిన రెండు సంవత్సరాలకే తండ్రి కాలం చేశాడు. సంవత్సరం తరువాత పెళ్ళయింది. అమ్మాయి బుద్ధిమంతురాలు. స్కూలు ఫైనలు వరకూ చదువుకుంది. లోకేశ్వర్రావు శుభలేఖలో అడుగున 'కానుకలు స్వీకరించబడవు' అని కొట్టించాడు. దానికింద 'ధనరూపంలో ఇస్తే ఆనందిస్తా' నని వేయించా డు. నేను చీవాట్లు పెట్టాను.

"నీకు బుద్ధుందా? ఎందుకలా చేశావ్?"

అంటే "అది కాదురా! నువ్వో గోడ గడియారం తెస్తావు" వాడో గోడ గడియారం తెస్తాడు. ఇంకొకళ్ళు గ్లాసులో, కంచాలో తెస్తారు. ఇవన్నీ ఎక్కడ తగిలించుకోను? మనకెవరూ బంగారాలు చదివించేయరు కదా? ఈ కంచాలూ, గోడ గడియారాలూ మా చెల్లెళ్లూ, అక్కలో ఎవ్వరో నేనిది పట్టుకుపోతారా బాగుంది. అంటే, కాదనగలనా? ఇవ్వలేకపోతే వాళ్లకి కోపం మా అమ్మకి కోపం వస్తుంది.

అంతేకాదు. నువ్వో నలభయ్యో, ఏభయ్యో ఇవ్వాలనుకుంటావ్. దాంతో వస్తువు కొంటావ్. ఆ ఏభై వస్తువా, ముప్పయికంటే ఎక్కువ వుండదు. అంటే ఆ ఇరవై... షావుకారికి కట్నంగా ఇచ్చినట్లే, అందుకే ధనరూపంగా ఇస్తే నాక్కావలసిన వస్తువు నేను కొనుక్కుంటాను. అలా ప్రింటు చెయ్యటంలో తప్పేముంది?" అన్న లాజిక్కు చెప్పేసరికి నాకు వాడిమీద కోపంపోయి జాలీ, నువ్వు వచ్చాయి.

పెళ్ళిరోజూ ముందేచెప్పాడు, ఎవరైనా డబ్బులు చదివిస్తే పుస్తకంలో నన్నే రాయమని అలాగేనన్నాను. కానీ మా అమ్మకి సీరియస్‌చేసి, హాస్పిటల్లో వేయాల్సి రావటం చేత నేను ఆసమయం మించి వెళ్ళాను. నాకాశ్చర్యం ఏమంటే పురోహితుడు చదివింపులు చదువుతుంటే లోకేశ్వర్రావు డబ్బులందుకుంటూ, పుస్తకంలో ఎక్కించుకుంటున్నాడు.

నన్ను చూసి "వచ్చావా? ఇదిగో ఇక నీదే ఈ బాధ్యత!" అని పెళ్ళికూతురుతో "లక్ష్మి! నీకొచ్చిన కానుకలూ, డబ్బూ తరువాత నువ్వేతీసుకో" అని అనేసరికి ఆ పిల్ల కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అంతటితో ఆగక వెళ్ళిపోతున్న మామగార్ని పిలిచి "మామగారూ! నేనూ అది కావాలీ, ఇది కావాలీ అని వేధించే మనిషిని కాను, పెళ్ళయిన తరువాత మీరేమిస్తే దాంతోనే తృప్తి పడతాను. అందునుంచి నాదో మాట. మీరేమనుకొనంటే...." అని ఆగాడు.

"చెప్పుబాబూ..." అన్నాడాయన.

"అదే. పెళ్ళికూతురుకొచ్చే కట్నకానుకలు అమ్మాయికే ఇచ్చెయ్యాలి. ఏవొచ్చినా, ఎంతొచ్చినా!" అన్నాడు లోకేశ్వర్రావు.

ఆ పక్కనే ఉన్న బావమరిది "అదెలాగవతుంది. మేం ఎంతమందికో ఇచ్చాం. వాళ్ళంతా నాన్నని చూసి ఇస్తారుకానీ. చెల్లాయిని చూసి ఇవ్వట్లేదు కదా! మీరిలా పేచీ పెట్టటం భావ్యంకాదు" అన్నాడు కాస్త పెద్దనోరుతో

"నాన్న! ఆ కానుకలు, డబ్బూ బాబు చెప్పినట్టూ.... పెళ్ళికూతురికే ఇచ్చెయ్యాలి. అది ధర్మం. నువ్వు పద. అనవసరంగా గొడవ చెయ్యకు" అని కొడుక్కి నచ్చచెప్పి, చదివింపులు అవగానే మొత్తం సొమ్మూ, వస్తువులూ లోకేశ్వర్రావుకే అప్పగిస్తే నన్ను చూపెట్టి "అక్కడిచ్చేయండి!" అన్నాడు.

అయితే ఆడపెళ్ళివారు 'మంచి అల్లుడు దొరికాడు' అని సణుక్కున్నా.... 'తరువాత ఇంకెలాంటి పేచీలు పెడతాడో' అని భయపడినా... లోకేశ్వర్రావు ఇద్దరు పిల్లలకి తండ్రీ అయినా...... వాళ్ళనెప్పుడూ బాధపెట్టలేదు. 'అంత మంచి అల్లుడు దొరకటం మా అదృష్టం' అని నాతో వాళ్ళంటారు కూడా! ఐతే అతి జాగ్రత్త వలన లోకేశ్వర్రావు చేసే పిచ్చిపనులు అతన్ని తక్కువచేసినా అతడు ఖాతరు చేయ్యడు.

ఓసారి--

లోకేశ్వర్రావు ఇంటిముందో పెంటకుప్ప ఉంది. ఆ పెంటకుప్పమీద పనికిరాని పౌడరు డబ్బాలూ, కొబ్బరి నూనె సీసాలు, పాత చెప్పులూ...... వాళ్ళ పనిమనిషి తెచ్చి పడేసింది. ఎందుకో వీధిలో కెళ్ళి నిల్చున్న లోకేశ్వర్రావుకి ఓ ముసలిది వాటిని ఏరుకోవటం కనిపించింది. "ఏయ్, ముసలమ్మా! వాటినేం చేస్తావ్?" అడిగాడు.

"బాబూ! ఇయన్నీ ఏరుకొని... ఇనప సామాన్లోడికిస్తే.... ఓ పదిరూపాయల్దబ్బులొస్తాయి. ముష్టెత్తుకుని... నలుగురిసేత 'సీ' యనిపించుకునే కంటే నయం గదా!" అంది.

"రోజుకెంత సంపాదిస్తావ్?"

"ఏటి సెప్పగలం బాబూ! తవురినాగా... పదిల్లోళ్ళు పారేస్తే రోజుకు ముప్పుయ్యొస్తాయి. నేపోతే ఊరల్లా తిరిగితే పదికి సచ్చుండదు" అంది.

"సరే. ఇవన్నీ మా పనిమనిషి తెలీక పడేసింది. రెండు పౌడరు డబ్బాలు, నాలుగు కొబ్బరినూనె సీసాలు, మూడు జతల పాత చెప్పులూ, ఇంకా ఈ చిన్నచిన్న రేకుడబ్బాలకి ఎంతిస్తావ్?" అన్నాడు.

"దరమ పెబువులు. మీరలగంతె లాగయ్యా సెప్పండి?" అంది.

ఈలోగా వాళ్ళావిడ వచ్చి "ఏమండీ! మీకు బుద్దుందా? పెంటకుప్ప మీద పారేసిన వాటిని ఏరుకున్నవాటికి డబ్బులుగుతున్నారా? నవ్వుతారెవరయినా?" అని ఆవిడంటే...

"నువ్వేం మాట్లాడకు... డబ్బులాట్టినే రావు. కాని వరకా దాస్తేనే వదో వందో అవుతుంది.

"అవును. ఆ డబ్బులు మీరిలాగా కూడబెట్టి.... ఎవరికో ఇచ్చేస్తారు!" అంది కోపంగా. అని చెయ్యిపట్టుకుని ఇంట్లోకి లాక్కుపోయింది. కొన్నాళ్ళు మేం పక్కపక్క ఇళ్ళలోనే ఉండటంచేత కిటికిలోంచి చూసిన మా ఆవిడ ఇది చూసి పొట్టచెక్కలయ్యేలా నవ్వుకొని చెప్పింది. నేనింటికొచ్చేసరికి.

ఓరోజు ఆఫీసునుండి వచ్చేనరికి లోకేశ్వర్రావు వచ్చాడు. ఎందుకో ముఖం చిరమరలాడుతోంది. అతనితోనే అతని భార్యా, ఇద్దరు పిల్లలూ వచ్చారు. కాసేపు కబుర్లయ్యాక, పెరట్లోకెళ్ళొస్తానని లేస్తోంటో "సరె ఓ అరగంటలో వస్తా, బజారుకెళ్ళి కూరలు కొనాలి!" అని వెళ్ళాడు.

నేను ఫ్రెషప్ అయి వచ్చి "ఏంటమ్మా! మా వాడు చిటపటలాడుతున్నాడు. రిక్షావాడితో గొడవ పడ్డాడా ఏంటి?" అన్నాను.

"ఆయన రిక్షా కూడా ఎక్కుతారా అన్నయ్యా! నడిచొద్దామంటే వినరు. స్కూటరు తియ్యమంటే ఊళ్ళోనక్కాటరెందుకు అనవనరంగా? పెట్రోలు ధర బాగా పెరిగిపోయిందని... సైకిలుతోనే వచ్చారు. వెనుక నేనూ చంటిదీ కూర్చుంటే, ముందు బాబు కూర్చున్నాడు" అంది.

"మరేమయిందిట?" అడిగాడు.

"ఆయన గుండెలో మంటగా ఉందని డాక్టరు దగ్గరకెళ్తానన్నారు. చాలా రోజులైంది మీ ఇంటికొచ్చి అలా వెళ్దాం అంటే సరేనన్నారు. దారిలో డాక్టర్ని కలిశారు. ఆయన ఇరవై ఫీజు తీసుకున్నాడు. 'ఇంతకు ముందే వదే ఇచ్చేవాణ్ణండీ' అంటే 'ఫీజు పెంచానండీ' అన్నాడాయన. ఏవో మాత్రలు రాసిచ్చాడు. ఈయన తిట్టుకుంటూ బైటకొచ్చి మళ్ళీ పాపనితీసుకెళ్ళి.... 'పాప ముక్కు తెగ కారిపోతుందండీ..... ఏవైనా రెండు మాత్రలుంటే ఇవ్వండి' అన్నారు.

ఆయన వెంటనే పాపను టేబిలు మీద పడుకోబెట్టి స్టెత్‌తో టెస్ట్‌చేసి 'మీదని లేట్ ఉంటుంది. వెళ్ళి బ్లడ్ టెస్ట్ చేయించుకురండి' అన్నాడు.

''సార్! అంత అవనరమా?' అన్నారీయన.

'మీకవసరమనుకుంటే చేయించండి... లేకపోతే మానెయ్యండి' అన్నాడు డాక్టర్ సీరియస్‌గా.

ఈయన తిట్టుకుంటూ మీదకెళ్ళి అక్కడ మళ్ళీ అడిగారు 'టెస్ట్‌లు తప్పనిసరా?' అని.

'డాక్టర్ గారెంతో అవసరమనుకుంటేగానీ టెస్ట్‌లు రాయండీ' అన్నాడు టెక్నీషియన్.

"చూశావా, టెస్ట్ చేయించటం మంచిదయింది." అందుకే ఏదొచ్చినా మన మంచికే అన్నారు. నేను డౌట్‌తో వెనక్కెళ్ళటం మంచిదైంది' అన్నారు.

ఆతర్వాత బ్లడ్ రిపోర్టు చూసిన డాక్టరు ఇదిగో ఈ దగ్గు సిరప్ ఇచ్చారు. వాడమని. ఈయన మెడికల్‌షాపులో చూపెడితే 'అబ్బే. ఏంలేదండీ. మామూలు జలుబే. తగ్గిపోతుంది' అన్నాడా షాపతను.

'మరీ పాటిదానికి బ్లడ్ టెస్టని యాభయి రూపాయిలు నాకెందుకు వదిలించాడా డాక్టరూ?' అని అగ్గి రుద్రుడైతే- 'ఏమోసార్!

ఆయకేదో డౌటొచ్చి ఉంటుంది. యాభై దండుగయినా.... పాపకి డిసీజ్ లేదని తెలిసినందుకు సంతోషించండి. అదే ఊపిరి తిత్తుల్లో ఏదో కఫం చేరటమో, మరేదో అయిందమకోండి, ఎంత ప్రమాదం?' అన్నాడతను.

'అదీ సంగతి. దొంగ రాస్కెల్ ఫ్రీగా మాత్ర ఇమ్మన్నానని నా చేతనింత ఖర్చు చేయించాడు. నిజంగా స్టెత్‌తో చూసినప్పుడే వాడికి తెలిసిపోతుంది' అని ఈయన తిట్టుకుంటున్నారు. అదీ ఆయన చిరమర, చచ్చిపోతున్నాననుకోండి" అని నవ్వుతున్న ఆమెను చూసి ముచ్చటేసింది. అలాటి భార్య దొరకటం నిజంగా మా 'లోకేశ్' అదృష్టమే!

నేనప్పుడప్పుడు చీవాట్లు పెడతాను. అలాటి పనులు చేసి 'ఆత్మగౌరవం' దెబ్బతీసుకోవద్దని. దానికతడు "నిజమేరా! నేనూ అప్పుడప్పుడు ఆత్మ విమర్శ చేసుకుంటాను. కానీ ఈ డబ్బులు లేక నేనా రోజుల్లో ఎన్ని బాధలు పడేవాణ్ణి?

మా నాయన ఎన్ని అవస్థలు పడేవాడో వీళ్ళకెవరికయినా అర్థమవుతుందా? నువ్వు చెప్పు. నేనెవరి సొమ్మూ ఆశించటంలేదు. నాజీవితానికి భద్రత కల్పించుకోవటం నా పెళ్ళాం పిల్లలకి.... సడన్‌గానేనేదైనా. అయితే.... అనాథల్ని చేసి వదలకుండా రక్షణ కల్పించటం నా విధి కాదా?" అనేవాడు.

ఇప్పుడు వాడి పరిస్థితి తల్చుకుంటే... వాడూ హించినట్లే జరిగింది అనిపిస్తోంది. 'భగవంతుడా! వాడికేం జరక్కూడదు' అని మరోసారి దేవుణ్ణి మొక్కుకున్నాను. ఈలోగా గవర్నమెంటు హాస్పిటల్ చేరుకున్నాం. గబగబా లోకికెళ్ళేనరికి వాళ్ళావిడ ఎదురొన్తూ కనిపించింది. కళ్ళొత్తుకుని చెప్పింది "ప్రాణానికేం ప్రమాదం లేదు. ఎడంకాలు కట్టుకట్టారు. బాగా దెబ్బతగిలింది. రిపోర్టువస్తేకాని కాలి పరిస్థితి చెప్పలేం అన్నారు డాక్టర్లు"

లోపలికి వెళ్ళేసరికి లోకేశ్వర్రావు నన్ను చూసి, "వచ్చావా! రారా! ఏదో ఆ భగవంతుడు మళ్ళీ నిన్ను చూడనిచ్చాడు" అన్నాడు.

"ఛ.. అవేం మాటల్రా. నీకేం? మైక్ టైస న్‌లా తిరుగుతావు" అని "అసలేంజరి గిందిరా?" అన్నాను.

"ఏం లేదురా? కూరలకని బయలు దేరాను. సైకిలు టైరు పంచరయింది. స్కూటరెందుకులే నడిచిపోవచ్చునుకున్నా. దారిలో చినుకులు ప్రారంభమయ్యాయి. రిక్షావాడు రైతుబజారుకు ఎనిమిది చెప్పాడు. మామూలుగా నాల్రూపాయలే. పోనీ వర్షం...... అయిదు తీసుకోమంటే పైసా తగ్గనన్నాడు. నేను పొమ్మన్నాను. తడుస్తూ నడుస్తోంటే..... మా పక్కింటి వాళ్ళబ్బాయి స్కూటర్‌మీద పోతూ 'అంకుల్ వస్తారా?' అన్నాడు కదాని ఎక్కాను. వాడు స్పీడెక్కించేసరికి బేలెన్సు తప్పింది. అట్నుంచి రిక్షా ఆ పక్కనే లారీ దూసుకువచ్చేశాయి.

రిక్షావాడు సైడు కోసేశాడు. వీడూ ఆ సైడ్‌కే తీయబోయి, పక్కకి తీశాడు. ఇంకేముంది? లారీ మీద కొచ్చేసింది. స్కూటర్‌మీద నుంచి కుర్రాడు ఎలా గెంతేశాడో రైట్ సైడ్‌కి గెంతేశాడు. ఆ గెంతటంలో మైలురాయికి బుర్రగుద్దుకుంది. తెలివి తప్పాడు. నిన్నటల్లా ఐ.సి.యులో ఉంచారు.

ఇప్పుడు జనరల్‌కి మార్చారు. ప్రాణానికేం ప్రమాదంలేదు. నామీదకి లారీ వచ్చేసింది. అయితే లారీ డ్రైవర్ గొప్ప ఎక్స్‌పర్ట్ కావటం వల్ల నా ప్రాణానికి ముప్పుతప్పింది. కానీ ఫ్రంట్ టైర్ బలంగా గుద్దటం వల్ల కాలు దెబ్బతింది. లారీ ఓనర్‌మీద కేస్ పెడితే లక్షయినా వస్తుందని అంతా అంటున్నారు. చిక్కొక్కటొచ్చిందీ అంటే ఈ అబ్బాయికి డ్రైవింగ్ లైసెన్స్ లేదట. కేస్ కొట్టేస్తారేమో?

అదికాదురా! కనీసం కాలుకేదైనా అయినా... ఓ ఇంక్రిమెంటు వస్తుందిరా! నా ఇంక్రిమెంట్ మూడు వందల యాభై. ఇంకా పదేళ్ళ సర్వీసుంది. వెధవ కాలుపోతే వచ్చిన నష్టమేముంది?" అంటున్న వాడి మాటలు వింటుంటే నాకు కోపం రాలేదు.

వాడి నరాల్లో దాగున్న దరిద్రం పెంచిన భయం మీద విపరీతమైన జాలివేసింది.